క్లుప్తంగా

దూరవిద్యకు దరఖాస్తు చేసుకోండి

నర్వ: తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు ఈ నెల 7తో ముగియనుండగా 20వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. ఒకే ఏడాదిలో ఈ కోర్సులు పూర్తి చేసుకునేందుకు గతంలో చదివిన బోనఫైడ్, రికార్డు షీట్, ఇంటర్‌కు అయితే పదోతరగతి పాస్ అయిన సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఇందు కోసం నర్వ ఉన్నత పాఠశాలలోని స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

కుర్వ సంఘం మండల కమిటీ ఎన్నిక

ధన్వాడ: మండల మదాసీ కురువ మండల కమిటీని రాష్ట్ర నాయకులు బండారి మల్లేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యువజన సంఘం అధ్యక్షుడిగా గుంజనూరు మల్లేష్, ఉపాధ్యక్షుడిగా కురువ నర్సింములు, సంజన్న, కార్యదర్శిగా శంకర్, సిద్దప్ప, ప్రచారా కార్యదర్శిగా కురువ నవీన్, కోశాధికారిగా పోర్ల సురేష్, గౌరవ అధ్యక్షులుగా ఎర్ర మల్లప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మక్తల్ తాలుకా అధ్యక్షులు ఆంజనేయులు, ఊట్కూర్ అధ్యక్షులు లింగప్ప, ఎస్సీ కురువ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆశప్ప, సత్యం, గజలప్ప పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మరికల్: నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మరికల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల కేంద్రానికి చెందిన రిషి ఉన్నత పాఠశాలకు చెందిన విగ్నేష్, చరణ్‌తేజ, గణేష్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో వారికి తెలంగాణ యోగా ఆసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందనం కురుపరకం చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్దాం

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఈ మేరకు ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు వెంకటప్ప, కర్రెప్ప, బాబు, ఆనంద్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆసరా పింఛన్ల పెంపు వంటి అంశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అందరూ కలెక్టరేట్‌కు కదలి రావాలన్నారు. కార్యక్రమంలో మాణిక్యప్ప, ఈదప్ప, ప్రవీణ్ కుమార్, గోవింద్, లక్ష్మణ్, రాజు అంజిలు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



ఆత్మకూర్: సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడడంతో ఆదివారం ఆత్మకూర్ పట్టణంతో పాటు మండలంలోని ఆలయాలన్నీ మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున దర్శనం ఉంటుందని ఆలయాల నిర్వాహకులు తెలిపారు. స్థానిక సాయిబాబా మందిరంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు శుద్ధి, సంప్రోక్షణ అనంతరం దర్శనాలు ప్రారంభిస్తామని, అలాగే గణపతి, నందీశ్వర, శ్రీదత్త, సంతానానాగదేవత, సద్గురు సాయిమూర్తులకు పంచాయమృత అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్ రావ్ తెలిపారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



అమరచింత: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న మెయిన్‌రోడ్‌లో ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కరెంట్ సరఫరా ఉన్నప్పుడు అనుకొని ప్రమాదం జరిగితే ప్రాణనష్టం తప్పదని, అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వినాయక శోభాయాత్రలో సందడి చేస్తున్న చిన్నారులు



నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు



సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న స్వాగత వేదిక ఉత్సవ కమిటీ సభ్యులు

వినాయకా.. వీడ్కోలిక

- ప్రశాంతంగా ముగిసిన ఉత్సవాలు
- ఆకట్టుకున్న మహిళలు, చిన్నారుల నృత్యం




భారీ గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు



వినాయకుడిని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న నిర్వాహకులు

మక్తల్: పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథులు ఆదివారం రాత్రి గంగమ్మ ఒడికి చేరుకున్నారు. నూర్ మజీద్, గాంధీచౌక్, ఆజాద్‌నగర్, రాంలీలా మైదానం, జామియా మజీద్, షరీఫా మజీద్ తదితర సంక్లిష్ట ప్రాంతాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మక్తల్‌లో చెరువు దగ్గర భారీ క్రేన్‌ను ఏర్పాటు చేశారు. క్రేన్ ద్వారా ఆయా విగ్రహాలను చెరువుకట్ట మీది నుంచి మున్సిపాల్ కమిషనర్ నర్సింములు , తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఉత్సవ నిర్వాహకులు విగ్రహాలను జలప్రవేశం చేసి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.



పెద్దచెరువులో గణేశుడిని నిమజ్జనం చేస్తున్న సిబ్బంది



శ్రీరాంనగర్‌లో ప్రతిష్ఠించిన గణేశుడి లడ్డును దక్కించుకున్న రాజేశ్ సాగర్



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాకిటి లలితమ్మ, బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి

సిబ్బందిని అభినందించిన ఎస్పీ



నారాయణ పేట క్రైం/నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగగా ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు. ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు దాదాపు 11 రోజుల పాటు అహర్నిశలు శ్రమించి పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి, వివిధ శాఖల అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారి సేవలను కొనియాడారు. అలాగే పోలీసులకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.



ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

మరికల్: మండలంలోని చిత్తనూర్ రామాల యంలో ఆదివారం ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ భక్తులతో వ్రతాల ను చేయించారు. అంతకుముందు సీతరాములకు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



అమ్మవారికి పౌర్ణమి పూజలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని బాపునగర్ శ్రీ చౌడేశ్వరి దేవి దేవాలయంలో ఆదివారం భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించి యజ్ఞ హోమాలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పద్మావతి, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు, బాపునగర్ ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

ఊట్కూరు/నారాయణపేట రూరల్: కేంద్రప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట ప్రధాన కార్యదర్శి రాము వేర్వేరుగా డిమాండ్ చేశారు. డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు గాను కేవలం 5.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేశారని ఆ పంటలకు యూరియా అవసరమవుతుందని యూరియా లేకపోవడంతో పంట దిగుబడి రాక రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం రైతుల సమస్యలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, ఎల్లప్ప, హనుమన్న, బాలప్ప, వెంకటేష్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాము

యూరియా కొరత తీర్చాలి

మరికల్: రైతులకు సరిపడా యూరియాను దిగుమతి చేసుకొని సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సింగిల్ విండో సొసైటీలతో పాటు, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో కూడా యూరియాను అందుబాటుల్లో ఉంచితే రైతులు ఎప్పుడు కావాలంటే అప్పుడు యూరియాను తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. వారానికి రెండు లారీల యూరియాను తెప్పించడం వల్ల ఒక్కసారిగా రైతులు యూరియా కోసం గుమిగూడడంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. యూరియాపై ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే రైతులు రోడ్లు ఎక్కి రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీని తగ్గించడం హర్షణీయం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం పేదలకు మేలు చేసేలా జీఎస్టీని తగ్గించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అట్టడుగు ప్రజలకు లాభం చేకూరుతుందని అంత్యోదయ పాలనకు పునాదులు పటిష్టం అయ్యాయన్నారు. ఇక నుంచి జీఎస్టీ లో 5, 18 శాతం స్లాబులే ఉంటాయని 12, 28 శాతం శ్లాబులు ఎత్తివేసినట్లు తెలిపారు. దీంతో నిత్యవసరాలు సరుకుల ధరలు తగ్గుతాయన్నారు. అలాగే మందులు, ఆక్సిజన్, డయాగ్నొస్టిక్, గ్లుకోమీటర్, కళ్ళజోడు 12 శాతం నుంచి 5 శాతానికి వ్యక్తిగత బీమా, ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలు 18 శాతం నుంచి సున్నా శాతానికి తగ్గించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్ రాములు, రఘురామయ్య గౌడ్, రఘువీర్ యాదవ్, నందునామాజీ, వెంకటయ్య, కృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

ఊట్కూరు: ఊట్కూరులో పౌర్ణమి సందర్భంగా వరుచరణానంద దత్తయ్య రాజయోగి పాదుక పూజను ఆదివారం శ్రీ దత్తలింగేశ్వరస్వామి దేవాలయంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, పాదుక పూజ, భజనలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు బ్రహ్మానందరాజు, సురేఖ, విజయరాజు, నర్సింహ, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రం బోధిస్తున్న నారాయణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల ఆదివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువా పూలమాలలతో సన్మానించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొక్కు శంకర్, నాయకులు ఆజమ్మ, నారాయణ, కొండన్‌గోపాల్, నర్సింగప్ప, హనుమంతు, దశరథ్, తిమ్మప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో

నర్వ: గ్రామాల్లో గత ఏడాదిన్నర కాలంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించండి మహాప్రభో అని పంచాయతీ సిబ్బంది, అధికారులు వేడుకుంటున్నారు. గత ప్రభుత్వ హయంతో పాటు కొత్త ప్రభుత్వంలో చేపట్టిన సీసీ రహదారులు, గ్రామ పంచాయతీల భవనాలతో పాటు మరికొన్ని పనులను పూర్తి చేసి దాదాపు 20 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు వస్తా యని అభివృద్ధి పనులు చేపడితే చేసిన అప్పు లకు వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గుర్తించి వెంటనే బిల్లులు మంజూరు చేసి తమ బాధలు తీర్చాలని కోరుతున్నారు.



రహదారులపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కొత్తపల్లి: ఉమ్మడి మండల పరిధిలోని రోడ్లపై పంట నూర్పిళ్లు చేస్తూ రోడ్లను కల్లాలుగా మారుస్తున్నారని ఈనెల 4వ తేదీన సాక్షి దిన పత్రికలో 'రహదారులే.. కల్లాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం మద్దూరు పోలీసులు నిడ్జింత గ్రామ సమీపంలో రోడ్డుపై ఆరబోసిన ఆముదం నూర్పిళ్లను తీసి వేయించారు. ఈ సందర్భంగా రోడ్లపై నూర్పిళ్లు చేసే రైతులకు అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టి టార్పాలిన్ కవర్‌లతో మూసి ఉంచడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇకపై రోడ్లపై ఏమైనా పంటలు ఆరబెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రోడ్డుపై ఆరబోసిన ఆముదం నూర్పిళ్లను తీయించేస్తున్న పోలీసులు

వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

కొత్తపల్లి: మండల పరిధిలోని కొత్తపల్లి–బూనీడు మధ్య వాగులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నెలలుగా నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో వరదల కారణంగా తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు స్పందించి తాత్కాలిక వంతెన నిర్మించినా భారీ వాహనాలు, కార్లు వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. అయితే వాగులో నీటి మట్టం తగ్గి వారం రోజులైనా బ్రిడ్జి నిర్మాణ పనులు పునః ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి వచ్చే వర్షాకాలం నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



కొత్తపల్లి-భూనీడు మధ్య నిలిచిన వంతెన పనులు

అందని బీమా.. రైతన్న ఆవేదన

- పీఎంఎఫ్‌బీవై పథకానికి మంగళం
- ప్రీమియం చెల్లింపు నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం



మాగనూర్ సమీపంలో నీట మునిగిన వరి పంట (ఫైల్)

మాగనూర్: భారీవర్షాలు, ఈదురుగాలులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటలకు నష్టం వాటిల్లితే రైతులకు పరిహారం అందించేందుకు కేంద్రం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం, మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది.దీంతో నష్టపోయినప్పుడు బాధిత రైతులు పరిహారం పొందేవారు.

ఐదేళ్ల నుంచి ప్రీమియం చెల్లింపు నిలిపివేత

పీఎంఎఫ్‌బీవై కింద పంట సాగు ప్రారంభంలో బీమా చేస్తే నష్టం వాటిల్లినపుడు అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అంచనాలు వేసి బాధితులకు బీమా అందేలా చేసేవారు. ఐదు (2020–21, 2024–25) సంవత్సరాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం నీరుగారుతోంది.

మండలంలో ఇలా..

మండలంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎకరాల్లో పత్తి, వరి, కంది, పెసర, మినుము పంట సాగు చేశారు. ప్రభుత్వం నియంత్రిత పంటల సాగు విధానం అమలులోకి తీసుకురావడంతో పత్తి పంట, వేరుశెనగ పంటలకు ప్రాధాన్యత ఇచ్చారు. గత సంవత్సరం మండలంలో పత్తితో పాటు వేరుశనగ పంటను ప్రధాన పంటగా సాగు చేశారు. గతంలో గ్రామ యూనిట్‌గా బీమా పథకాన్ని వర్తింపజేశారు. ఎకరాకు రూ.500 చొప్పున ప్రీమియం తమ ఆధార్, పట్టాపాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నెంబర్‌లతో ఏఈవో లేదా రెవెన్యూ అధికారి ధృవీకరణతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

30శాతం మేర నష్టం

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, వరి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచానా వేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బీమా పథకం ఉంటే రైతులు నష్టపోకుండా ఉండేవారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు విత్తనాలు మొలకెత్తకపోవడం, నార్లు వేయకపోవడం కలిగే నష్టాలకు బీమాలో 25 శాతం వరకు సత్వరం చెల్లించే అవకాశం ఉండేది. తుపాను, అకాల వర్షాల కారణంగా నష్టం జరిగితే నష్టాన్ని అంచనా వేసి షరతులతో కూడిన చెల్లింపులు చేస్తారు. కానీ ఈ సారి ఫసల్‌బీమా ప్రస్తావనే లేకపోవడం రైతులకు కలవరపెడుతోంది. ప్రారంభంలో ఫసల్ బీమా పథకంలో చేరే రైతుల ప్రీమియంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే ఏటా 90శాతం వరకు చెల్లించేవి. కాని ప్రభుత్వాలు ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పథకానికి అడ్డంకులు ఏర్పడ్డా యి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్య పరిష్కారించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ఇబ్బందులు తొలగించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్‌జీవై పథకాన్ని నిలిపివేయడంతో భారీ వర్షాల కారణంగా పంట నష్టం వాటిల్లినా ప్రభుత్వాల నుంచి సహాయం అందడం లేదు. నిలిపివేసిన పథకాన్ని మళ్లీ ప్రారంభించి రైతులకు నష్టం లేకుండా చూడాలి.

–బాలకృష్ణ, రైతు, అమ్మపల్లి గ్రామం

ఆదేశాలు రాలేదు..

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం విషయంలో అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బాధిత రైతులకు పరిహారం అందేది. రెండేళ్ల నుంచి బీమా నిలివేయడం జరిగింది. కేంద్రం 25 శాతం, రాష్ట్రం 25 శాతం, రైతు 50 శాతం ప్రీమియం చెల్లించేవారు. కానీ పథకం నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుకోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

–సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏవో, మాగనూర్